క్లుప్తంగా

కుక్కలను నియంత్రించాలి



మాట్లాడుతున్న యూనిస్ బాషా

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రం నంద్యాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ వృద్ధులు, పిల్లలను గాయపరుస్తున్నాయని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ అన్నారు. స్థానిక కార్యాలయ ఆవరణలో ఆదివారం ముఖ్యనాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కుక్కలను నియంత్రించకపోతే వీధుల్లో తిరిగేందుకు ప్రజలు భయపడాల్సి వస్తుందన్నారు. మనుషులను గాయపరుస్తున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాలకు అధికారులు మంగళం పాడటం దారుణమన్నారు. వాటి బెడద నివారణకు చర్యలు చేపట్టకపోతే సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్‌గులాబ్, ఇక్బాల్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యోగా సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్ పార్కులోని ఆయుష్ యోగ సెంటర్‌లో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యోగా సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు భజనలు ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాలతో పాటు 20 మంది రక్త దానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు దస్తగిరి, నాగేశ్వరరావు, ఆంజినేయులు, వెంకటేశ్వర్లు, రమేష్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొట్టాలలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి-ఇందూ జ్ఞాన వేదిక నంద్యాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన గ్రామోత్సవం 6 గంటల వరకు పురవీధుల గుండా అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమంలో సభ్యులు మురళీకృష్ణ, మధుసూదన్‌యాదవ్, రామకృష్ణ, మణికుమార్, జయచంద్ర, జయన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె గ్రామానికి చెందిన చిన్న జం బులయ్య, జయకుమార్, రవికుమార్, మద్దిలేటి, మణికంఠలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆదివారం రాత్రి తెలిపారు. ఈ నెల 12వ తేదీన అదే గ్రామానికి చెందిన మల్లెల చిన్న ఓబులేసు, ఆయన తల్లి లచ్చమ్మ పొలం వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పక్కనే ఉన్న నిందితులు పొలం తమదని ఇక్కడ పనులెందుకు చేస్తున్నారని దాడి చేసి కులం పేరుతో దూషించారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చిలుకలూరు వద్ద వక్కిలేరులో పెరిగిన నీటి ప్రవాహం



రుద్రవరానికి సమీపాన జలమయమైన మొక్క జొన్నపైరు



వర్షపు నీరు నిల్వతో మాచినేనిపల్లె వద్ద మినుము పంట దెబ్బతిన్న దృశ్యం

ఆశలు వర్షార్పణం!

రుద్రవరం: రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసిరాలేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే చివరికి నిరాశే మిగిలింది. గత కొద్ది రోజులుగా మండలంలో కురుస్తున్న వానలు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పొలాల్లో దాదాపు మోకాళ్లలోతు నీళ్లు ఆగడంతో పైర్లు కుళ్లిపోతున్నాయి. ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి. రుద్రవరం మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు పలు పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన మినుము పంట జలమయం కావడంతో రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది.ఈ మండలంలో మొక్కజొన్న 5 వేల హెక్టార్లు, మినుము 2500 హెక్టార్లు, పత్తి 100 హెక్టార్లు, వేరుశనగ 100 హెక్టార్లు సాగు చేయగా ప్రస్తుతం ఈ పంటలన్నీ నీటిలోనే ఉన్నాయి. మొలక దశలో ఉన్న మొక్కజొన్న, వేరుశనగ, పత్తి పైర్లు నీటి నిల్వతో కుళ్లిపోతున్నాయి. ఈ పంటలను కాపాడుకునేందుకు రైతులు ఓ వైపు పొలాల్లో నుంచి నీటిని బయటకు పారదోలుతుంటే మరోవైపు వర్షం కురుస్తుండటంతో ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వానకు పేరూరు, ఎర్రగుడిదిన్నె ,చిలుకలూరు గ్రామాల పక్కనే ఉన్న వకిలేరు వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

లులూ షాపింగ్ మాల్‌కు భూకేటాయింపులు రద్దు చేయాలి



ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విజయవాడలోని ఆర్టీసీ స్థలాన్ని 'లులూ షాపింగ్ మాల్'కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ 137ను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక నిశాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు దేవసహాయం, ఆర్ఎస్‌రావు మాట్లాడుతూ ఆర్టీసీ ఆస్తులు కాపాడుకునేందుకు ఆర్టీసీలోని అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆస్తులను కూటమి సర్కారు ప్రైవేటు వ్యాపార వేత్తలకు ధారదత్తం చేయడం సరికాదన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు డీఎస్ఎస్ రాయుడు, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, జీఎల్ రెడ్డి, కాశీం, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



గోస్పాడులో స్వామివారి గ్రామోత్సవ దృశ్యం



కోలాటమాడుతున్న బాలికలు

గోస్పాడు: శ్రీకృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన గోస్పాడులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీ రుక్మిణి సత్య భామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ ధర్మకర్త ముక్కమల్ల వేణుగోపాల్ రెడ్డి, న్యాయవాది వివేకానందరెడ్డి అధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోలాటాల ప్రదర్శనను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దొర్నిపాడు:శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. దొర్నిపాడు, క్రిష్టిపాడు గ్రామాల్లో ఉట్టిమహోత్సవం సందడిగా నిర్వహించారు. బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రథంపై శ్రీకృష్ణుడిని కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీకృష్ణుడి గ్రామోత్సవంలో గ్రామస్తులు



క్రిష్టిపాడులో ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యర్రగుంట్లలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1993–94 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు నాటి హెచ్ఎం చిట్టెమ్మ, టీచర్లు వేమారెడ్డి, నరసింహులు, తిరుపతిరెడ్డి, దత్తన్న, సరోజిని, వసంత, సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లను విద్యార్థులు శాలువలు కప్పి పూల మాలలతో సన్మానించారు. తమ గురుభక్తిని చాటారు. పాఠశాలకు ఉచితంగా స్థలం ఇచ్చిన సత్తార్ రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రుద్రవరం: చెరువులో శనివారం ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఆలమూరుకు చెందిన గోవిందిన్నె వుశేన్‌బాషా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాధిత రైతు తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ జీవించేవాడని..ప్రస్తుతం ఆయన మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. ప్రమాదంలో రూ.1.50 లక్షలు విలువ చేసే కాడెద్దులు సైతం చనిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించి రూ. 20 లక్షలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నంద్యాల: మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త హెచ్చరించారు. నంద్యాల పట్టణంలో మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు ఆదివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో 47 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డరన్నారు. వీరిని నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో సమావేశపరిచి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడంతోపాటు రూ.2,01,400 జరిమానా విధించామన్నారు. మరల ఇదే విధంగా మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఉపేక్షించం



నంద్యాల వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి



సరైన ధ్రువపత్రాలు లేని బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నంద్యాల: శాంతిభద్రతలకు భంగం కలిగించినా, నేరాల్లో పాల్గొన్నా గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా, మట్కా, జూదం కార్యకలాపాలలో పాల్గొన్నా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని 8 పోలీసు స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నంద్యాల పోలీసు స్టేషన్ల పరిధిలో సరైన ధ్రువపత్రాలు లేని 23 వాహనాలను, ఆళ్లగడ్డ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 8 వాహనాలు, డోన్ సబ్ డివిజన్‌కు చెందిన జలదుర్గం, ఎస్. రాచర్ల , అవుకు, ప్యాపిలి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 26 మోటార్ సైకిళ్లను, 27 మద్యం బాటిళ్లు ,30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు, నేరచరిత్ర గల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఉద్యాన పంటల్లో నీటిని తోడేయాలి

- లేకపోతే తెగుళ్లు సోకే ప్రమాదం
- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు సూచనలు



మిరప పైరుకు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జిల్లాలో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో పంటపొలాల్లో నీరు నిలిచి పైర్లు దెబ్బతింటున్నాయి. ఉద్యాన పంటల్లో నీటి నిల్వతో తెగుళ్ల సోకే అవకాశం కూడా ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు ఆదివారం తెలిపారు. నిల్వ ఉన్న అదనపు నీటిని బయటకు పంపాలని, మొక్కలు బలంగా పెరగడానికి పోషకాల మోతాదు పెంచాలని రైతులకు సూచించారు. వ్యాధి కారక శిలీంద్రాలను చీడపీడలను నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలని, లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తిరిగి నాటుకోవాలన్నారు. చెట్లను లేపి మొదళ్ల వద్ద మట్టి ఎగదోయాలని సూచించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

- ఉల్లిపంటలో మొక్కలు కుళ్లిపోకుండా పొలంలో ఉన్న నీటిని తీసి 19:19:19 మూడు గ్రాముల సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- గడ్డ కుళ్లిపోకుండా ఉండటానికి రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలి.
- ఆకుమచ్చ కొరకు స్ప్రే రెడ్‌మిల్ గోల్డ్ 1.5 గ్రాముల, ల్యాంబాసైలోత్రిన్ 1 ఎంఎల్ ప్లస్ మ్యాక్స్ 3 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నాలుగు రోజుల తర్వాత మెటలాక్సిల్ 3 గ్రాములు, పొటాషియం, మొలిబ్ డేడ్ 3 గ్రాములు, ఫెర్టిసల్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మిరపలో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి పది గ్రాములు యూరియా, 10గ్రాములు పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- మొక్కలు వాడిపోయి తలలు వాల్చినట్లు అయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి.
- కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రు వేసి అంతర్ కృషి చేయాలి.
- పైపాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలి.
- పంటను బ్యాక్టీరియా, ఆకుమచ్చ వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ మందులను కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- కాయకుళ్లు, ఎండుకొమ్మ తెగులు వ్యాప్తి చెందకుండా ఒక మి.లీ ప్రొఫికొనజోల్, 2.5 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ మందులను లీటరు నీటికి కలిపి ఒకటి మార్చి ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పిచికారీ చేయాలి.
- కూరగాయల పంటలకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృతి ఉంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా లీటరు నీటికి 2.5 గ్రాముల షాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలి.
- పూలతోటల్లో ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొఫికొనజోల్ ఒక మి.లీ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి రెండు సార్లు పిచికారీ చేయాలి.

మతసామరస్యానికి ప్రతీక

- గూటుపల్లె పెద్దరాజుస్వామి దర్గాకు 600 ఏళ్ల చరిత్ర
- ఈనెల 20 నుంచి ఉరుసు ఉత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా ముఖద్వారం



స్వామివారి సమాధి

బేతంచెర్ల : మతసామరస్యానికి ప్రతికగా చారిత్రక నేపథ్యం కల్గి వేలాది మంది భక్తులు దర్శించేది గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్‌బాషా ఉరఫ్ పెద్దరాజు స్వామి వారి ఉరుసును అన్ని మతాల వారు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు ఉరుసు ఘనంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

శతాబ్దాల చరిత్ర కలిగిన పెద్ద రాజుస్వామి దర్గా

పెద్దరాజుల స్వామి 600 వందల సంవత్సరాల క్రితం సాది అరేబియా దేశంలోని జిద్దా సమీపంలో గల అదన్ పట్టణంలో సయ్యద్ అబూబకర్ సక్రాన్ ఇద్రూస్ వలి మక్కికు జేష్ఠ పుత్రుడిగా జన్మించారు. లోక కల్యాణార్థం పెద్దరాజుస్వామి 9 సంవత్సరాల వయస్సులోనే తన తల్లిదండ్రులను వదిలిపెట్టి భారతదేశానికి వచ్చి మొట్ట మొదట కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్‌లో కొన్ని సంవత్సరాలు నివాసం ఉండి.. అనంతరం ఆదోని పట్టణానికి వచ్చారు. తదనంతరం స్వామి వారు అక్కడి నుంచి గూటుపల్లెకు వచ్చారు. ఇద్రూస్ బాషాకు ముగ్గురు భార్యలు. వీరిలో ఇద్దరు భార్యలకు సంతానం లేదు. మొదటి భార్యకు ముగ్గురు సంతానం కాగా వారిలో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అయితే అక్కడంతా దట్టమైన అడవి ఉండేది. ఈ ప్రాంతంలో యాదవులు ఆవులు, గొర్రెలు మేపుతూ జీవనం చేసేవారు. స్వామివారు తన తండ్రి ఆజ్ఞానుసారం చేతి కర్రను తీసుకొని గూటుపల్లెలో నేడు ఉన్న దర్గా స్థలంలో నాలుగు రకాతులు నమాజు చేసిన తర్వాత మిస్వాక్ పుల్ల వేయగా అది మొక్కగా మారింది. ఆ వెంటనే రాత్రి పాతిన ఆసా తీసి వాసన చూడగా తన స్వగ్రామమైన ఆదోని భూమి వాసన వచ్చిందని, తన తండ్రి కూడా ఇదే స్థిర నివాసం అని చెప్పడంతో స్వామి కూడా ఇక్కడే నివాసముండేందుకు గూటుపల్లె గ్రామ ఏర్పాటుకు సంసిద్ధులయ్యారు. ఇక్కడ గ్రామం ఏర్పాటు చేసి ఖుదాపల్లె అని నామకరణం చేశారు. కాలక్రమేణా అదే గూటుపల్లెగా మారింది. స్వామి వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని సంతతే ఇప్పుడు ఉన్న పీఠాధిపతుల వంశం.

స్వామివారి మహిమలు

ఇద్రుస్ బాషా ఉరఫ్ పెద్ద రాజు గూటుపల్లెలో స్థిర నివాసం నిర్ధారణ అయిన తరువాత గొర్రెల కాపరుల భయం పోగొట్టేందుకు కొండపై ఉన్న పులులను కొండ తీగలతో కట్టి తీసుకొని రావడంతో వీరికి పెద్దరాజు అని పేరు వచ్చింది. అందువల్ల ఆయనను పెద్దరాజు స్వామిగా పిలుస్తున్నారు. ప్రతి గురువారం పెద్ద పులి వచ్చి తనతోకతో గర్భగుడిని శుభ్రం చేసేదని చరిత్ర చెబుతుంది. దర్గ ఆవరణలో దెయ్యం, భూతం, పిశాచి పీడలు కలవారు ఒక్క రోజు నిద్ర చేస్తే పీడల తొలిగిపోతాయని గ్రామస్తుల విశ్వాసం.

దర్గాకు 13 వ పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ



ఎంతో చరిత్రాత్మకమైన ఇద్రూసాబాషా దర్గాకు నేటికి 13 మంది పీఠాధిపతులుగా వ్యవహరించారు. 16 సంవత్సరాల క్రితం 12వ పీఠాధిపతి అయిన సయ్యద్ హాఖాని బాషా అకాల మరణంతో వంశ పారంపర్యంగా పీఠాధిపతిగా అతని కుమారుడైన సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ 6 సంవత్సరాల వయస్సులో 13వ పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టాడు. విశేషమేమిటంటే గూటుపల్లె పీఠంతో పాటు భారత దేశంలోని 90 పీఠాలకు ఈయన పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.

వేల ఎకరాల మాన్యం రాసిచ్చిన ఔరంగ జేబు

మొఘల్ సామ్రాజ్యపతనానికి కారకుడైన ఔరంగజేబు కూడా 1681లో ఈ గ్రామాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ సమయంలోనే ఔరంగజేబు.. పెద్దరాజస్వామికి వేలాది ఎకరాల మాన్యం ఇచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

కూలిన మట్టి మిద్దె

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో కొద్దిరోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన బలిజ చంద్రుడు ఇంటి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో కూలిన గదిలో కూకుండా మరో గదిలో చంద్రుడు, కుటుంబ సభ్యులు ఉండటంతో ప్రమాదం తప్పింది. అధిక వర్షాలు కురుస్తుండంతో మట్టిమిద్దెలలో నివశిస్తున్న ప్రజలు సురక్షిత భవనాలలో చేరుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ హెచ్చరించారు.